# అర్చిరాది సారము

మనకు భాగవత మైత్రి-వాట్సాప్
సమూహం ద్వారా అందించిన
వారు
శ్రీమాన్ దరూరి. నరసింహాచార్యుల వారు.

# అర్చిరాది సారము-1

శ్రియఃపతికి నిత్యవిభూతి, లీలావిభూతి అను రెండు విభూతులును శేషభూతమైయున్నవి.

నిత్యవిభూతియందున్నవారు భగవంతుని ఆజ్ఞను తలదాల్చిఆయన అనుగ్రహపాత్రులై ప్రవర్తించెదరు. వారు అంజలి ఘటించి నిరంతరము నమః అని చెప్పుదురు. వారు శ్రియఃపతిని తప్ప అన్యదేవతలను ఆశ్రయించరు. అర్థపంచకజ్ఞానము కలిగి ప్రవర్తించెదరు. వారు భగవంతుని దివ్యమంగళవిగ్రహము వంటి దివ్య శరీరాలతో ప్రకాశించెదరు. వారు సామగాన పరాయణులైయుందురు. వారు నిరంతరము భగవత్కైంకర్య నిష్ఠులైయుందురు. వారు భగవద్గుణానుభవము చేయుచు ఆనందపరవశులైయుందురు. వారు భగవంతుని సేవకై అనేక దివ్యశరీరాలు ధరించి స్వామి దివ్యాయుధములను మోయుచు భగవంతుడికి ఒకప్రక్కగా సంచరిస్తుంటారు. ''ఆశ్రితులను రక్షించుటయే తన దీక్ష"అను సర్వేశ్వరుని మాటను విశ్వసించి నిర్భయులైయుందురు.

ఇక లీలావిభూతియందున్న వారు అట్లుకాక తమ ఇచ్చానుసారముగా స్వతంత్రులై ప్రవర్తించుదురు. వారు అహంకార మమకారములతో "ననమేయం"అనుచుందురు. వారు శ్రియఃపతిని కాదని అల్పదేవతలను ఆశ్రయించుదురు. జ్ఞానహీనులై పశుప్రాయులైయందురు. కర్మవశ్యులై జన్మపరంపరలో కొట్టుకొనుచు ప్రాకృతమైన మలినశరీరాలతో క్రుమ్గుచుందురు. భగవంతుని స్తతించుట మాని నరస్తుతి చేయుచుందురు. భగవత్కైంకర్యవిముఖులై నీచులను సేవిస్తు సంసార దుఃఖసాగర నిమగ్నులైయుందురు. భగవదాజ్ఞయగు వేదశాస్త్రములను ఉల్లంఘించి విడ్డూరముగా నడచుకొందురు.

# అర్చిరాది సారము-2

శ్రియఃపతి పరమదయాళువగుటచే చేతనోజ్జీవనార్థమై ఎంతప్రయత్నించినను బద్ధజీవులు స్వామి చేతికి అందకుండ సంసారమున పరుగెత్తుచుందురు. అల్పములు అస్థిరములు అయిన సంసార విషయభోగములను అనుభవిస్తు ఇదియే సర్వస్వమని భ్రమించియుందురు. ఇట్టి వీరి నీచత్వమును చూచి వీరితో తమకుకల స్వాభావిక గర్భసంబంధమును పట్టి విడువలేక, సర్వేశ్వరుడు అనేక అవతారములను ధరించి తిరుగుచున్నాడు. అట్టి సర్వభూత సుహృత్తగు శ్రీహరి ప్రయత్నవిశేషము ఒకానొకసమయమందు, ఒకానొక బద్ధునియందు ఫలించును.

అప్పుడా జీవుడు భగవద్భాగవత ఆనుకూల్య సంకల్పము కలవాడై, మోక్షాపేక్షతో సంసారము పట్ల వైరాగ్యముతో ప్రవర్తించును. సత్సాంగత్యప్రభావముచే భగవదభినివేశము పరిపక్వమై సదాచార్య సమాశ్రయణము పొందును. ఇక అతడు భగవవంతునికి ప్రీతికరముగా ప్రవర్తించును. సంసారముయొక్క క్రౌర్యమును తలచి పాము నోటపడిన కప్ప వలె, కారుచిచ్చు మధ్యనున్న ఆడులేడి వలె, ఇరుప్రక్కల మండుచున్న కొరకంచు మధ్యనున్న చీమ వలె, అల్లకల్లోలముగానున్న సముద్రమున మునుగుతున్న పడవయందున్న వానివలె

"ఓ నారాయణా!నాకు రక్షకులెవరు? నన్ను ఇంకను సంసారములో పడత్రోసెదవా? ఇంకను పాడుచేయచూతువా?

ఓ స్వామీ! ఇంద్రియములనెడి శత్రువులు నన్ను బలవంతముగా లాగుకొనిపోవుచున్నవి. నేను వారి దాడిని ఎదుర్కొనలేను.

సీతాపిరాట్టి రాక్షసస్త్రీలతో సహవాసము భరించలేక ఎట్లు దుఃఖించిందో అట్లు దుఃఖించును. సంసారమే పరమపురుషార్థమని భావించే సంసారులతో సహవాసము అతనికి ఎంతమాత్రమూ గిట్టదు. స్వామీ!నారాయణా! నీఛమైన ఈ సంసారము పొందకుండచేయుము. పరమపురుషా! శ్రీమన్నారాయణా! నేను నిన్ను ఎక్కడ పొందకలను?

నిన్ను పొందు ఆ మంచి రోజు ఎప్పటికి? నేనా పరమపదమును ఎన్నటికీ చేరికలను? ఇక నేన సంసారమును ఎంతమాత్రమూ భరించలేను.

నీవు నన్ను పరమపదమునకు కొనిపోవు కాలమింకను సమీపించలేదా? "కూవికొళ్ళుంకాలం కురుకాదో"అని మొరపెట్టుకొనును. భగవంతునికొరకు పరితపించి నిప్పుతోచేరిన మైనమువలె కరిగిపోవును. భగవద్విశ్లేషము భరించలేక దుఃఖించును. కృతకృత్యుడై మృత్యువు కొరకు ఎదిరిచూచుచుండును. తాను ఇంతవరకు ఆదరించి హేయమని విడిచిపెట్టిన మలిన శరీరమును, భార్య యొక్క ఉచ్ఛిష్టమును ఆదరించు రాజపుత్రుని వలె శ్రీహరి ఆదరించుట చూచి "స్వామీ!ఈ దేహము నశించుటకు సమ్మతించుము. "అని ప్రార్థించును. స్వామీ!ఇక నీవు నన్ను విడిచిపెట్టవద్దు. నీవు వదలిపెట్టి వెళ్ళినచో లక్ష్మీదేవిపై ఒట్టు, నీపై ఒట్టు అని పరమాత్మను నిర్బందించును. "నేను నాభక్తుని మరణకాలమున స్మరించి పరమపదమునకు కొనిపోవుదును. అను ప్రతిజ్ఞను నిలపెట్టుకొనుమని భగవంతుని ప్రార్థించును.

## అర్చిరాది సారము-3

సజ్జన సాంగత్య ప్రభావము వలన బుబుక్షువుగానున్న జీవుడు ముముక్షువుగా మారును. సంసారము పట్ల విరక్తి పరమాత్మ పట్ల అనురక్తి వృద్ధి పొందును. జ్ఞానానుష్ఠానసంపన్నుడైన సదాచార్యులను ఆశ్రయించి పంచసంస్కారములు పొంది పరమప్రపన్నుడగును. భక్తి జ్ఞాన వైరాగ్యసంపన్నుడై ప్రపన్నుడు శరీరావసానముకొరకు పరితపించును.

కృతకృత్యుడైన ప్రపన్నుని పరమపదమునకు కొనిపోవుటకు సత్యసంకల్పుడగు సర్వేశ్వరుడు స్వయముగా సంకల్పించును. తన పాదారవిందములయందు ఈ చేతనుడు చేసిన ఒక్క నమస్కారమునకు ప్రతిఫలముగా ఋణము వడ్డీ లెక్కించి అసలు కంటె వడ్డీయే తీర్చలేనంతగా పెరిగి పోయినదని విచారపడును. ఓయీ!నీకు నీసంబంధులకు నేను ఋణపడితిని కదా! అని ప్రత్యుపకారము చేయుటకై ఆలోచించును.

పరమపదనాథుడు బాగుగా ఆలోచించి ఈ ప్రపన్నుని పరమపదమునకు కొనిపోవుటయే తగినదని నిశ్చయించుకొనును. ఇతనిని పట్టి పీడిస్తున్న సంసారవిషసర్పము యొక్క కోరలు తీసి నిర్వీర్యము చేయును.

సర్వసమర్థుడైన స్వామి వీని సంసారవృక్షమూలమును చ్ఛేదించును. వీనిని పరమపదమునకు కొనిపోవుటకు త్వరపడును.

వాస్తవముగా వీడు భగవంతునికొరకు పడిన ఆర్తి గోష్పాదమంతటిది. భగవంతుడు వీనికొరకు పడిన ఆర్తి సముద్రమంతటిది. కాని ఆశ్రితవత్సలుడైన శ్రియఃపతి ప్రపన్నుని సముద్రమంతటి ఆర్తిలో తనయార్తి గోష్పాదమంతటిదని సిగ్గుపడి ఇక క్షణకాలము కూడ ఆలస్యము చేయక ఇతనిని పరమపదమునకు వేంచేపుచేసుకొనుటకు నిర్ణయించుకొనును. శ్రీరామచంద్రునిపట్టాభిషిక్తుని చేయుటకు దశరథ మహారాజు వసిష్ఠ వామదేవాదులను మంత్రులను సమావేషపరచి సమాలోచనచేసినట్లు ఉభయవిభూతులకు నాయకుడైన పరమపురుషుడు శ్రీమన్నారాయణుడు అనంత గరుడ విష్వక్సేనాది దివ్యసూరివర్యులను సమావేశపరచి ప్రపన్నుని పరమపదయాత్రకై అర్చిరాది మార్గమును ఏర్పాటుచేయును.

## అర్చిరాది సారము-4

దశరథుడు శ్రీరాముని పట్టాభిషేకము కొరకై రాజభవనమును అలంకరింపచేసిన విధముగా పరమపదనాథుడు ముక్త పురుష పట్టాభిషేకము కొరకై శ్రీవైకుంఠమును అలంకరింపచేయును. పోయిన వస్తువు లభించినట్లు ఆనందపడి శ్రియఃపతి శ్రీమన్నారాయణుడు ఈ చేతనుడు సదాచార్య సమాశ్రయణము చేసిన నాటినుండి అతనిని తన తన కొంగున ముడివేసుకొని, నిర్హేతుకమైన కృపావర్షమును కురిపించును. అతని కైంకర్యజ్ఞానమనెడి ధనమును గైకొని అతనికి విధేయుడై ప్రవర్తించును. ఇతడు చేసిన పుణ్యములను ఇతని అనుకూలురకు , పాపములను ప్రతికూలురకు పంచిఇచ్చును.

శ్రీరామచంద్ర స్వామి శరణాగతిచేసినను అనుకూలించని సముద్రునిపై కోపించి బాణమును ఎక్కుపెట్టెను. అతడు అనుకూలించిన వెంటనే అతనిపై ఎక్కుపెట్టిన బాణమును అతని శత్రువులపై ప్రయోగించెను. ప్రపన్నుని సంబంధుల నరకానుభవమును తొలగించి వారు స్వర్గానుభవము పొందునట్లు చేయును.

శ్రీవైకుంఠనాథుడు వేదాత్ముడైన గరుడాళ్వారుని అధిరోహించి ప్రపన్నుడు కోరిన విధముగా వచ్చి వచ్చి దర్శనమనుగ్రహించును. నంజీయర్ స్వామి వారు దీనిని సర్వస్వదానమని చెప్పుదురు.

గరుత్మంతుని అధిరోహించి వేంచేసిన స్వామి బంగారు కొండపై వ్యాపించిన నల్లటి మేఘము వలె తన దివ్యమంగళవిగ్రహ సౌందర్యమును పెంపొందించుకొని ప్రపన్నుని అనుగ్రహించును. ఆతివాహికులను రప్పించి తాను ఆదరించిన ముక్తుని చరమ శరీరమునకు శేషవస్త్రమును శేషమాలికను సమర్పణ చేయించి ఘనముగా సన్మానించుటకు ఆదేశించును.

## అర్చిరాది సారము-5

అటు పిమ్మట ఈ చేతనుని ఇంద్రియములు మనస్సునందు, మనస్సు ప్రాణమునందు, ప్రాణము జ్ఞానమునందు లయము కాగా, జ్ఞానము పరమాత్మపై నిలుచును. అనగా బాహ్యకరణములు అంతఃకరణములలో, అంతఃకరణములు ప్రాణములో, ప్రాణములు ఆత్మలో, జ్ఞానస్వరూపమైన ఆత్మ భూతసూక్ష్మములతో కలిసి శ్రీమన్నారాయణుని సమీపమున చేరును. ఇచ్చట ఆత్మజ్ఞానము పరిపూర్ణమగును.

గ్రీష్మకాలములో ప్రచండభానుని ప్రతాపమును తట్టుకొనలేక చల్లటి నీడనిచ్చు చెట్టు నీడను చేరి సేదతీర్చుకొనువిధముగా సంసారతాపతప్తుడైన జీవుడు వాసుదేవ తరుచ్ఛాయను చేరి విశ్రాంతి తీసుకొనును.

తిరుక్కోవలూరు అను దివ్యదేశమును సేవించుటకు తిరుమంగైఆళ్వారులు బయలుదేరగా, సమస్త లోకములను పవిత్రము చేయుటకై ఏ స్వామి వామనుడై వచ్చి త్రివిక్రముడై తమ దివ్యపాదారవిందములతో భూమిని కొలిచెనో, ఆ పరంధాముడే అడుగడుగున ఒక దివ్యదేశమును ఏర్పాటుచేసుకొని తనను కీర్తింపచేసుకొనెను. శ్రీహరి నామ సంకీర్తనము కంటె మించినదేమున్నది? "పాథేయం పుండరీకాక్షనామసంకీర్తనమ్" అని ముక్తపురుషునకు అర్చిరాదిమార్గములో ద్వయమంత్రానుసంధానము దారిబత్తెమగును. కనుక

నిరంతరము ద్వయమంత్రమును, శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రమును అనుసంధించుకొనవలెను.  ఇదియే పరమప్రయోజనము.

## అర్చిరాది సారము-6

"ఏతేనప్రతిపద్యమానాః దేవయాన పథాః సర్వే ముక్తిమార్గాభిలాషిణః"-ఈ మార్గమున వెళ్ళువారందరు ముక్తిమార్గాభిలాషులు. దీనిని దేవయానమని కూడ అందురు. "ఏతేన ప్రతిపద్యమానాః ఇమం మానవ మావర్తం నావర్తంతే "-  అని ఈ అర్చిరాది మార్గమే పునరావృత్తి లేని శ్రేష్ఠమైన మార్గము.

అధఃపాతాళమునందు పడియున్న చేతనుని  బ్రహ్మాండముల అవతలయున్న పరమపదమునకు తీసుకొనిపోయి రక్షించినవాడు పరమపురుషుడు పురుషోత్తముడు వాసుదేవుడు. ఆస్వామి అందరికి ఆప్తతముడు. సహస్ర ఫణములు కలిగిన అనంతునిపై శయనించియున్నవాడు. నల్లటి అందమైన కేశపాశము, ఎర్ర తామరలవంటి సువిశాల దివ్యనేత్రములు, దొండపండు వంటి అధరములు కలిగి కాలమేఘమువలె కనిపించు వాడు. భూలోకవైకుంఠమైన శ్రీరంగ క్షేత్రమున వెలుగు విరజిమ్ముతున్న మెరుపుల పరంపరవలెనున్న శ్రీరంగనాథుడు, శ్రియఃపతి, శ్రీమన్నారాయణుడు అర్చిరాది మార్గమున ముక్తునకు సహాయపడును.

పరమోపకారకుడగు శ్రియఃపతి విరజాతీరమునకు ముక్తుని చేర్చును. ఆహ్లాదకరమైన తిల్యకాంతారవనమునందు విశ్రమింపచేయును. ఐరంమదీయమను సరస్సున స్నానమాడించి శ్రియఃపతి తానే విశ్రాంతిస్థానమై ముక్తుని సంసారతాపమును చల్లార్చును.

## అర్చిరాది సారము-7

శ్రియఃపతి సింహాసనాసీనుడైయున్న తిరుమామణి మండపము ముక్తుని గమ్యస్థానమగును. అర్చిరాది లోకాధిపతులు గోష్ఠిని నిర్వహించెదరు. ఆకాశమంతట వ్యాపించిన మేఘధ్వనులు ప్రయాణపటహధ్వనులగును.

సర్వాంతర్యామి, నిత్యసూరి నిర్వాహకుడగు సర్వేశ్వరుడు అర్చిరాది మార్గము చూపి  ముక్తుని ముందుకు నడిపించు  సహాయకుడుగా ఉండును.

శ్రియఃపతి ఈ చేతనుని స్వీకరించుట వలన ఇతని ఘోరమైన సంసారము తొలగిపోవును. సంసారబంధమునుండి విముక్తుడైన ఇతడు సంసార మనెడు నరకమును హేళన చేయును. ఓ మనసా! ఈ సంసారమెంత భ్రష్టమైనదో చూడుమనును.

కోటిసూర్యుల తేజస్సును మించి ప్రకాశించుచున్న శ్రీవైకుంఠమును ముక్తుడు చేరుకొనును. ఇప్పటికే చిగురించిన ఆశలు ఉప్పొంగగా సీతాదేవి, విభీషణుడు లంకను విడిచి బయటకు వచ్చినవిధముగా ప్రపన్నుడు తన హృదయకమలము నుండి బయటపడుటకు త్వరపడును.

## అర్చిరాది సారము-8

"శతంచైకాచ హృదయస్యనాడ్యః"- శరీరమునందు హృదయమునకు అనుసంధానము చేయబడి నూటాఒకటి నాడులు కలవు. వాటిలో సుషుమ్నానాడి ఊర్ధ్వముఖముగా ప్రసరించియుండును. దీనినే మూర్ధన్య నాడి అందురు. న్యాసవిద్యాప్రభావము వలన నిరంతర అర్చిరాది మార్గచింతనాపరుడగు ప్రపన్నుడు హార్ధపురుషుడగు శ్రియఃపతి సహాయముచేయగా బ్రహ్మరంధ్రమును చీల్చుకొని అనాయాసముగా బయటపడను.

"తాసు నాడీషు సృప్తాః ఆభ్యోనాడీభ్యతాయంతే, తేముష్మిన్నాదిత్యేసృప్తాః అధత్తైరేవరస్మిభిరూర్ధ్వమాక్రమతే"అని నూటఒక్కటి నాడులనుండి వేరైన సుషుమ్నానాడి నుండి వెడలు కిరణములు ప్రపన్నుని ఆత్మను సూర్యుని వద్దకు చేర్చును. సూర్యకిరణమార్గానుసారియై ప్రపన్నుడు పరమపదప్రయాణము చేయును.

ప్రపన్నుడు ప్రణవవిమానము నెక్కి మనస్సు సారథ్యము చేయగా పరమానందముతో పరమపదయాత్ర కొనసాగించును.

అర్చిరాదిమార్గమున ప్రపన్నుడు పరమపదమునకు పోవుచుండగా శ్రీరంగనాథుని శ్రీహస్తమునందలి సుదర్శనచక్రము యొక్క తేజస్సుచే ఉభయవిభూతులు నూత్నశోభను సంతరించుకొనును.

ఆజకజలలైదిరైక్కెయెడుత్తాడిన-అని ఆళ్వారులు అనుగ్రహించినట్లు సముద్రము తన గాంభీర్యమును ప్రక్కకుపెట్టి తరంగహస్తములతో ఇసుకను తీరమువైపు నెట్టి  ఆనంద నృత్యము చేయును.

## అర్చిరాది సారము-9

ఊర్ధ్వలోకవాసులు బహుమానములు పట్టుకొని పందిళ్ళువేసి , తోరణములు కట్టి, పూర్ణకుంభములను వ్రేలాడదీసి ముక్తపురుషునకు స్వాగతము పలికెదరు.

పుష్పవర్షమును కురిపించుదురు. కొద్దిసమయమైనను తమ గృహములయందు సేద తీర్చుకొనుమని ముక్తుని ప్రార్థించెదరు. దేవతలు ముక్తుని ఎదుర్కొని తమనివాసస్థానములను సమర్పించెదరు.

కిన్నరులు మొదలైనవారు మంగళగీతములు పాడెదరు. కొందరు మంగళగీతములు పాడెదరు. కొందరు యాగాదుల పుణ్యఫలములను, మరకొందరు ధూపదీపాదులను సమర్పించెదరు. కొందరు శంఖములూదగా మరికొందరు స్తోత్రపాఠములను పఠించెదరు.

ఏనాడు అంతఃపురాలను వదలి బయటకురాని ఆతివాహికుల ధర్మపత్నులు యువరాజైన మీరు లేని ఈ రాజ్యము అరాజకమగునని దీనిని పరిపాలింపుమని ముక్తునకు మంగళాశాసనము చేసెదరు.

## అర్చిరాది సారము-10

ముక్తపురుషుడు అర్చిరాదిమార్గమున ముందుకుపోవుచుండగా మరుత్తులు, వసువులు అయ్యో!భగవంతుడు మనకిచ్చిన అదృష్టవిశేషము చేజారిపోవుచున్నదే అని విచారించెదరు. వివిధ లోకాధిపతులు ముక్తుడు తమ లోకమును దాటిపోవుచున్నాడని పొలిమేర వరకు వెంట వచ్చి సాగనంపెదరు.

ఆతివాహికులు ముక్తపురుషుడు శ్రియఃపతి యొక్క సంపదయని తమకు రక్షకుడని ప్రశంసిచెదరు. వారందరు అంజలి ఘటించగా ఘనసన్మానమలతో ముక్తుడు తన ప్రయాణమును కొనసాగించును .

"తేర్చిషమేవాభి సంభవంతి అర్చిషోహ్న మాపూర్యమాణ పక్షాద్యాన్, తాన్మాసేభ్యస్సంవత్సరం సంవత్సరాదిత్యం, ఆదిత్యాచ్చాంద్రమసం చాంద్రమసో విద్యుతం, తేనప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదోజనాః" అని ఛాందోగ్యము, వాజసనేయము, కౌషీతకీ ఉపనిషత్తులు, భగవద్గీతాదులు చెప్పినట్లు  అర్చిరాది లోకాధిపతులు వెంటనుండి నడిపించగా ముక్తపురుషుడు పరమానందముతో ముందుకు ప్రయాణము కొనసాగించును.

## అర్చిరాది సారము-11

శ్రియఃపతిని శరణాగతిచేసిన జీవుడు శరీరమునండి బయటపడగానే అర్చిలోకములో ప్రవేశించును. అర్చిపురుషుడు సత్కరించి ముందుకు నడిపించగా అహః పురుషుని, శుక్లపక్షాభిమానిని, ఉత్తరాయణాభిమానిని, సంవత్సరాభిమానిని, తరువాత వాయువును సమీపించును.

అర్చిరాదిమార్గమునందు వారు ముందుకు నడిపించగా  ముక్తుడు ప్రచండ కిరణములు కలవాడైన, బంగారుమయమైకాలచక్ర ప్రవర్తకమైన దివ్యరథమందున్న సూర్యునియొక్క మండలమున ప్రవేశించును. ముక్తుడు మరొక సూర్యుడా అన్నట్లు నిరవధికమైన తేజస్సుతో సూర్యమండలమును భేదించుకొని ముందుకువెళ్ళును.

కారార్ పురవేజ(ఇయఋా్వ, శిరియ తిరుమడల్ 6పా)లో చెప్పినట్లు మేఘమండలమందు సంచరించుచున్న ఏడు గుఱ్ఱములను పూన్చిన ఒక చక్రము కల దివ్యరథము కలవాడైన సూర్యునియొక్క మండలమును భేదించుకొని ముక్తుడు పరమపదమునకు వెళ్ళును.

అట్లు పైకిపోయి గ్రహ నక్షత్ర తారకలకు నిర్వాహకుడైన చంద్రుని సమీపించును.

చంద్రుని చేత సత్కరింపబడి ముక్తుడు అమానవుని సమీపించును. అతడు సత్కరించి ముందుకు నడిపించగా వరుణుని సమీపించును.

ఆతరువాత త్రైలోక్యాధిపతియైన ఇంద్రుని సమీపించి వారిచేత సన్మానాలను పొందును. ఆతదుపరి దేవతలు, అసురులు, గంధర్వులు, యక్షరాక్షసులకు అధిపతియైన ప్రజాపతి వద్దకు వెళ్ళును.

వారి లోకములను దాటి, బ్రహ్మాండమును, దశోత్తరమైన ఆవరణసప్తకమును, మూలప్రకృతిని ముక్తుడు దాటిపోవును.

# అర్చిరాది సారము-12

ముక్తుడు పరమానందకరమైన అర్చిరాది మార్గమున తన ప్రయాణము కొనసాగించు సమయమున పూర్వము తాను అనుభవించిన నరకలోక బాధలను తలచుకొని అసహ్యించుకొనును. సంసారమున పడియున్న దినములందు చీకటిచేత చుట్టబడి నీరు నీడయు లేకుండ వినినంతనే వణికిపోవలసిన క్రూరమైన యామ్యమార్గమందు యమభటుల పాశములచేత, పుత్రదారాది పాశములచేత కట్టబడితిని.

యమదూతల పాశములచేత బలవంతముగా లాగబడి, కుక్కలు కరవగా శక్తి, శంఖు, తోమరము, బాణము, శూలము మొదలగు ఆయుధములచేత తీవ్రముగా కొట్టబడితిని.

యమకింతరుల నోళ్ళ కాహారమై ఒళ్ళంతా రక్తము చీము కారగా దూతలను అన్నము, నీరు కోరగా ముక్కు ముఖము దవడలు పళ్ళు చితికిపోయి, చేతులు కాళ్ళు ఊడిపోయి దుఃఖించితిని.

అట్టి భరింపరాని దుఃఖము తీరునట్లు చూచినవారందరు సత్కరించగా సుఖోత్తరమైన అర్చిరాదిమార్గమునందు తనకుపాయమైన శ్రీమన్నారాయణ దివ్యశ్రీచరణారవిందములను స్మరిస్తూ పరమపదమునకు శీఘ్రముగా పోవును.

ఇదివరకు శబ్దస్పర్శాదులనబడు సింహవ్యాఘ్రములనుండి తప్పించుకొని సంసారమనెడి పెద్ద తుప్పనుండి బయలుదేరి, తాపత్రయములనబడు కారుచిచ్చునందు పడిన కష్టమంతయు తీరునట్లు అర్చిరాది మార్గమున పయనించి పరమపదమున ప్రవేశించును.

"భీతోస్మ్యహం మహాదేవ శృత్వా యామ్యమార్గవిస్తరం"-ఓ మహాదేవా!నేను యామ్యమార్గ విస్తారమును విని భయపడితిని.

## అర్చిరాది సారము-13

అటుపైన యామ్యమార్గమందలి ఘోరమైన వైతరిణికి వ్యతిరేకమైన అమృతవాహినియైన విరజానదిని ముక్తుడు సమీపించును.

మేఘావృతమైన సూర్యుని వలె, రాహుగ్రస్తమైన చంద్రుని వలె, బురదలో మునిగియున్న మాణిక్యము వలెనున్న ముక్తుడు విరజానదిలో స్నానముచేసి తనమాలిన్యమును పోగొట్టుకొనును.

విరజానదియొక్క నీటి స్పర్శమాత్రముచేత సూక్ష్మశరీరము పోయి కోటిసూర్యులు ఒకేసారి ఉదయించినట్లు కంటితోచూడ శక్యము కాని విధముగా నిరవధిక తేజస్సుతో ముక్తుడు ప్రకాశించును.

చతుర్భుజుడై శంఖ చక్ర గదాధియై విరజాతీరమందు వేంచేసియున్న అమానవుని ముక్తుడు సమీపించును.

అమానవ కరస్పర్శచే లావణ్య సౌందర్యాది కళ్యాగుణములకాకరమైన శుద్ధసత్త్వమయమైన భగవదనుభవయోగ్యమైన దివ్యమంగళవిగ్రహమును ముక్తుడు పొందును.

"తత్రస్తు విరజాతీరప్రదేశం స ఆగచ్ఛతి విరజానదిం"

(ముక్తుడు విరజానదినిగూర్చి వచ్చుచున్నాడు. )

"తత్తోయ స్పర్శమాత్రేణ"

(ఆ విరజా నదియొక్క నీటిస్పర్శమాత్రముచేత)

"సూర్యకోటి ప్రతీకాశః"

(కోటిసూర్యులతో సమానమైన తేజస్సుకలవాడగును. )

"అమానవం సమాసాద్య"

(అమానవుని పొందును. )

## అర్చిరాది సారము-14

శ్లో ॥లోకాచార్యాయ గురవే కృష్ణపాదస్యసూనవే

సంసారభోగిసందష్ట జీవజీవాతవే నమః॥

అర్చిరాదితోపాటు సమస్త రహస్యగ్రంథాలను పరమకృపతో అనుగ్రహించిన ఆచార్యసార్యభౌములు శ్రీమాన్ పిళ్ళై లోకాచార్య స్వామి వారి తిరునక్షత్రోత్సవ శుభాకాంక్షలు.

ఆళ్వార్ ఎంబెరుమానార్ జీయర్ తిరువడిగళే శరణం.

పరమపదము కర్మసాధ్యము, త్రిగుణాత్మకము, నశ్వరము కాదు. అది భగవత్ప్రీతి సాధ్యమై, శుద్ధసత్త్వాత్మకమై, అంతము లేని ఆనందమునకు ఆలవాలమైయుండును.

అజ్ఞానమును కలుగచేయు ఈ పృథివి వంటిది కాదు. జ్ఞానమును కలుగచేయు ఉత్తమమైనట్టి ప్రదేశము పరమపదము.

సనకాది మహర్షుల మనస్సులకు కూడ గోచరము కాకుండ భగవదానుకూల్యమే భోగముగా కలవారైన నిత్యసూరులచేత నిండియున్నట్టిది పరమపదము.

వారిచేతకూడ పరిచ్ఛేదింపశక్యముకాని పరిమాణము, సౌందర్యము, భోగము కలదైన పరమపదమను దివ్యదేశమును ముక్తుడు కన్నుల కరువు తీరునట్లు నిలచి సందర్శించును.

“పులనైన్దు మేయుమ్”(తి. వా. మొ. 2ప. 8తి. 4పా. )

తా॥ఇంద్రియవిషయములనుండి నివృత్తులై అవధిలేని పరమపదమునందు ప్రవేశించేవారలారా!ఉత్తమ ఫలమును పొందుటకు ముందు అసురులను సంహరించిన శ్రీమన్నారాయణుని దివ్యకళ్యాణగుణములయందు విచ్ఛేదము లేకుండ అవగాహించండి.

# అర్చిరాది సారము-15

భాగవతమైత్రి బృందమునకు విజయ దశమి పర్వదిన శుభాకాంక్షలు దాసోహములు.

ముక్తపురుషుడు పరమపదమునకు చేరి నమస్కరించును. అచ్చట శంఖ కాహళ భేరీ నినాదములను వినును.

పరమపదవాసులు పరుగెత్తువారు, పడిపోవువారు, సంతోషముతో ఆలకించువారు, వెతుకువారు, మా ఉపకారకుడు ఎక్కడున్నాడనువారు, చూచినాము, చూచినాము, నేత్రపర్వమైనవారిని చూచినాము దాసులందరు రండనుచు అందరు కలసి పెద్ద ఆరవారము చేసెదరు.

సంఘసంఘములుగా వచ్చుచున్న నిత్యులు మరియు ముక్తులయొక్క ఆనంద కలకలమును అనుభవించుచు ముక్తుడు పరమప్రీతితో ముందుకు పోవును. ఆ ముక్తపురుషుని అలంకరించుటకు ఐదువందల మంది అప్సరసలు ఎదురుగా వెళ్ళెదరు. దివ్యమాల్యము, దివ్యాంజనము, దివ్యచూర్ణము, దివ్యవస్త్రము, దివ్యాభరణము మొదలగువానిని ధరించి వచ్చెదరు.

ఐదువందల మంది దివ్యాంగనలు , నిత్యసూరులు ఎదురుగావచ్చి ముక్తునకు బ్రహ్మాలంకారము కావించుదురు.

తం పంచశతాన్యప్సరసాం ప్రతిధావంతి. శతం మాలా హస్తాః శత మంజన హస్తాః, శతం చూర్ణహస్తాః, శతం వాసోహస్తాః, శతం భూషాహస్తాః, తం బ్రహ్మాలంకారేణాలంకుర్వంతి, అని శృతి చెప్పుచున్నది.

భగవంతుడు ధరించి తీసివేసిన దివ్యవస్త్రము, దివ్యమాల్యము, దివ్యాభరణములు, దివ్యాంగరాగములు మొదలగువానిచేత అలంకరించబడిన ముక్తపురుషుని చూచి అచ్చటివారు ఆశ్చర్యచకితులై ప్రశంసలు కురిపించెదరు.

తరువాత అనేకవేల ధ్వజములచేత, ముత్యాలసరములచేత అలంకరించబడినదై భగవంతుని సంకల్పముచే కల్పించబడిన దివ్యవిమానమును గరుత్మంతుడు తీసుకొనివచ్చును.

## అర్చిరాది సారము-16

గరుత్మంతుడు తెచ్చిన దివ్యవిమానము నెక్కి ముక్తుడు తిల్యకాంతారమునకు చేరును. అచ్చట నానావిధములైన ఉపహారములను ధరించి వేరే అప్సరసలు ఎదురుగా వచ్చి సత్కరించెదరు.

తరువాత తిల్యగంధము బ్రహ్మగంధము ఆఘ్రాణించి సర్వగంధుడై ముక్తుడు ధ్వజపతాకాదులచేత అలంకరింపబడిన శ్రీవైకుంఠ దివ్యగోపురమును సమీపించును.

శ్రీవైకుంఠద్వారపాలకులు "శ్రియఃపతి దాసులైన మీరు మావారు మాఅధికారములయందు ప్రవేశించుడి"అనుచు ముక్తుని సత్కరించెదరు.

జనసమూహముచే వ్యాకులమైన శ్రీవైకుంఠద్వారమును దాటి మనస్సును నేత్రములను శ్రమపడి వెనుకకు మరల్చుకొని లోనికి ప్రవేశించును.

అయోధ్య యనియు అపరాజిత యనియు చెప్పబడుచున్న పరంధాముని పరమాకాశమందలి శ్రీవైకుంఠనగరమునకు వెళ్ళి"శ్రీవైకుంఠ దివ్య నగరాయ నమః" అని నమస్కరించును.

శ్రీవైకుంఠమందలి కైంకర్య నిష్ఠులును, గుణనిష్ఠులును"సముద్రజలము సహ్యపర్వతమునెక్కి ప్రవహించినట్లు సంసారమందున్న ఇతడు పరమపదమునకు వచ్చినాడే"అని ఆశ్చర్యము పొంది కొనియాడెదరు.

## అర్చిరాది సారము-17

తరువాత అనంత, గరుడ, విష్వక్సేనాది దివ్యసూరివర్యులు ముక్తుని తమ తమ మందిరములకు తీసికొనివెళ్ళి, ఉన్నతాసనమున ఆసీనునిచేసి ,

తాము క్రిందకూర్చుని , తమతమ భార్యలు నీరుపోయగా శ్రీపాదములను అభిషేకించి, ఇతని ప్రభావమును చెప్పి సత్కరింతురు.

తరవాత శఠకోపమును, దివ్యచూర్ణములను. పూర్ణకుంభములను, మంగళదీపములను ధరించి దేశాంతరము వెళ్ళివచ్చిన పుత్రుని చూచిన తల్లులవలె కొందరు యువతులు వచ్చి ఎదుర్కొందురు.

పెద్దవీధిగుండా లోనికి ప్రవేశించి దివ్యమైన ఆవరణ శతసహస్రములచేత ఆవృతమై హిరణ్మయమైన పరమపదనాథుని కోవెలను సమీపించి" శ్రీవైకుంఠ దివ్యవిమానాయనమః"అని ప్రణమిల్లును.

ముక్తుని రాకచేత శ్రీవైకుంఠమున ఒకమడికట్టు వర్షము పడినట్లుండును. చెట్లు చిగురించి పుష్పించును. అనేకమైన రంగులు గంధము కల అప్రాకృత పుష్పములచే వైకుంఠమందలి తోటలు శోభిల్లును.

## అర్చిరాది సారము-18

మకరందము స్రవించుచున్న కల్పవృక్షముల యొక్క తోటలచేత, పలువిధములైన పుష్పములచే, రత్ననిర్మిత లీలామండపములచేత, ఆశ్చర్యజనకములైన క్రీడాపర్వతములచేత, శ్రీశ్రియఃపతులకు లీలాపరికరములై, మధుముగా మాటలాడు చిలుకలు గోరువంకలు కోకిలలు నెమళ్ళు మొదలగువాటిచేత శ్రవైకుంఠము నిండియుండును. మాణిక్యాదులచేత ఏర్పాటుచేయబడిన మెట్లుకలదై నిత్యముక్తుల హృదయములవలె చల్లనై స్వచ్ఛమైన జలములచేత నిండిన సరస్సులు అనేకము అచ్చటనుండును.

## అర్చిరాది సారము-19

నానావిధములైన పక్షిసంఘములచేత పరివ్యాప్తమై, స్రవించుచున్న మకరందప్రవాహము కలదై, చంద్రవదనలగు యువతుల ముఖములకు నేత్రములకు సదృశమైన కలువలు మొదలగు అప్రాకృత పుష్పములు కల నానావిధ పుష్పపర్యంకముల చేత , పరిమళపుష్పములయందు అవగాహించి, మకరందమున మునిగి, మత్తభృంగములయొక్క

దివ్యగాంధర్వముచేత సమీపించిన వారిని మైమరపించుచున్న దివ్యోద్యానశతసహస్రములచేత శ్రీవైకుంఠము చుట్టుకొనబడియుండును.

నానారత్నమయ స్థలములు కలదై అనేకవేల రత్నస్తంభములచేత అలంకృతమై , ఉభయవిభూతులయందున్నవారందరు ఒకమూలకు సరిపోయేలా వైశాల్యము కలదై, పరిమళభరితపుష్పములు, చందనము, అగరు, కర్పూరము మొదలైనవాటిని కలుపుకొనివచ్చుచున్న మందమారుతముచే సేవించబడుచున్నదై, నిరతిశయానందమయమైన తిరుమామణి మంటపమును ముక్తుడు సమీపించును.

“ఓం ఆనంద మణిమంటపరత్నాయ నమః”అని ముక్తుడు సాష్టాంగముగాప్రణామము చేయును.

నిరంతరము అతృప్తామృతపానము చేయుటచేత లేబ్రాయము పొంది శ్రియఃపతితో సామ్యము పొందినవారై సంతోషాధిక్యమును లోన ఇముడ్చుకోలేక బయటకువచ్చినట్లు సామగానముచేయువారును, ఆనందప్రవాహమున కొట్టుకొనిపోకుండ సౌశీల్యమనెడు అవలంబన స్తంభమును పాతువారును, అచ్చట వేంచేసియున్న స్వాచార్యులను సందర్శించి నీవలననే కదా!శ్రియఃపతిని పొందకలిగితిని అనెడివారును, మా స్వామీ శ్రీమన్నారాయణా! మిమ్ము చేరి మీ దివ్యపాదారవిందకైంకర్యమును పొందితిని ఇదియే ఇంకను కావలెను అనెడివారును, నామనస్సునందు కలిసిన స్వామీ!మీ సౌశీల్యము నెట్లు చెప్పవలెనో తెలియుటలేదనెడి వారును, విచ్ఛేదము లేకుండ తిరుమంత్రమును అనుసంధానము చేయుచున్న వారును శ్రీవైకుంఠమున వేంచేసియున్న నిత్యులు మరియు ముక్తులు. ఆమహానుభావులతో ముక్తుడు కలిసి భగవంతుని సేవించును.

## అర్చిరాది సారము-20

ముక్తుడు పరమాత్మను సంశ్లేషించి నాఆత్మను శుద్ధక్రయముగా చేసితిని అని ఆత్మసమర్పణము కావించును. ప్రబలమైన పాపముకల నన్ను చీల్చివేయుచున్న గుణములు కలిగిన తేజస్సు కలవాడా!అని కీర్తించి దాస్యరసము ఉన్మస్తకమై మాటిమాటికి నమః, నమః అనుచుండును.

“శెజ్ఞో౯ఙ్కవికాళుయిర్”(తి. వా. మొ. 10ప. 7తి. 1పా)తా॥తిరుమాలిరుంశోలైయందు వేంచేసియున్న వంచకుడైన దొంగ , ఆశ్చర్యభూతుడగు సర్వేశ్వరుడు కవి వలె వచ్చి నాఆత్మయందును, మనస్సునందును కలిసియుండి దేవేరులకు కూడ తెలియకుండ నామనస్సును ఆత్మను అనుభవించి పూర్ణుడాయెను. ఓ కవులారా!మీఆత్మను స్వామికి సమర్పణము చేసి కైంకర్యము చేయండి.

పాశురములో చెప్పినట్లు ముక్తుడు ఆత్మసమర్పణము చేసి భగవత్కైంకర్యమును పొందును.

ప్రళయసముద్రమందు అల్లాడువారివలె ఆనందసాగరమున ఓలలాడి, నిత్యముక్తులు చెప్పుచున్న భోగ్యమైన మాటలను వినుటచేత, సంసారమున కఠినమైన మాటలను వినిన కష్టమంతయు తీర్చుకొని, ముక్తుడుపరమాత్మయొక్క దివ్యాస్థానమును సమీపించును.

ఆమహాసభయొక్క మధ్యన తమతమ కిరీటములయందు తమకు అసాధారణమగు దివ్యాయుధములను చిహ్నములను ధరించి అంజలిబద్ధులై అస్త్రశస్త్రముల పేర్లు కలవారైన నిత్యసూరివర్యులు, తమ సంకల్పమాత్రముచేత సృష్టి స్థితి సంహారములు చేయకల విష్వక్సేనాది దివ్యపురుషులను ముక్తుడు క్రమముగా సేవించును. (సశేషము)

## అర్చిరాది సారము-21

ఉభయవిభూతులను చిత్తరువుగా ఏర్పరచబడిన సర్వాశ్చర్యకరమైన శిల్పములు కలిగిన శ్లాఘ్యమైన దివ్యసింహాసనముండును.

దానిపై ద్వాదశాక్షరీమంత్రాత్మకమైన పన్నెండు రేకులు కలిగిన నానాశక్తిమయమైన దివ్యకమలముండును. దాని కర్ణికయందు దివ్యయోగపర్యంకముండును.

దానిపై అనేకవేల చంద్రులు కరగించిపోసినట్లు చల్లటి కాంతి

తో కూడిన తిరుమేనిని కలిగిన ఆదిశేషుడు ఉండును.

కళ్యాణగుణములకు అంతము లేకపోవుటచేతను, సర్వవిధకైంకర్యములకు సంసిద్ధుడై కైంకర్యపరులకుపమానమై యుండుటచేత అనంతుడని, శేషుడని అతనిని పిలిచెదరు.

భగవదనుభవమును వ్యక్తము చేయుటకు అతనికి అసంఖ్యాకమైన నోళ్ళు, తలలు కలవు.

అనంతుడు విజ్ఞాన బలములకు, శైత్య మార్దవ సౌరభ్యాదిగుణములకు నిలయమైనవాడు.

వెండికొండశిఖరమందుఅనేకవేల సూర్యులు ఒకేసారి ఉదయించినట్లున్న ఫణామండలములయందలి జ్యోతిర్మండల మధ్యభాగమునందు ఉభయవిభూతులకు అధిపతియగు శ్రియఃపతి వేంచేసియుండును.

పట్టమహిషి మహాలక్ష్మి ప్రక్కన వేంచేసియుండును. ఆమె పరిమళమునకే పరిమళమునిచ్చు సుందరకేశపాశముకలిగియుండును.

అమ్మ లక్ష్మీదేవి విశాలమైన తన దివ్యనేత్రసౌందర్యముచేత పుండరీకాక్షుడు సర్వజగన్నాథుడగు సర్వేశ్వరుని తనవైపు మరల్చుకొని తనదాసునిగా చేసుకొనును.

మహాలక్ష్మి స్వామి భోగమునకు కావలసిన అలంకారమువలె బాల్య యౌవనముల మధ్యయందున్న నిత్యయౌవనమును సౌకుమార్యమును కలిగియుండును.

చల్లని పద్మమునందలి ప్రతిమ వంటిదైన మహాలక్ష్మియందు స్వామి వ్యామోహము కలిగియుండును. తక్కిన దేవేరులపట్ల ప్రవర్తింపనీయని భోగ్యతాప్రకర్ష మహాలక్ష్మియందుండును.

## అర్చిరాది సారము-22

మహాలక్ష్మి దేవి భోగారంభక్రీడయందే భగవంతుని విశ్వరూపమును సంకోచింపచేయునట్టి గొప్పమహిమ కలిగియున్నట్టిది.

ఆమె దివ్యపరిజనులను పరమాత్మకైంకర్యమునందు నియోగించును. ఆ తల్లి సమస్తాత్మలకు సమానముగా సమాశ్రయణీయమైయుండును.

పెరియపిరాట్టి స్వరూప రూప గుణ విభవ ఐశ్వర్యాదులచేత భగవంతునకు అభిమతానురూపముగా కుడిప్రక్కన వేంచేసియుండును.

మహాలక్ష్మి తాయారును మించిన క్షమ దయాదిగుణములు, వర్ణనాతీతమైన దివ్యసౌందర్యము కలవారై, లక్ష్మీదేవికి ఛాయవంటివారైన

భూదేవి నీళాదేవి అను ఇద్దరు దేవేరులు స్వామికి ఎడమప్రక్కన వేంచేసియుందురు.

శ్రీ భూ నీళాదేవేరుల మధ్యన మూడు మెరుపు తీగలతోకూడి తామరలను పూచిన ఒక నీలమేఘము వెండి పర్వతము కబళీకరించినట్లుగా అవగాహించియున్నట్లు తిరుముఖమండలకాంతి ఊర్ధ్వముఖంగా ప్రసరించినట్లు పరమపదనాథుడు వేంచేసియుండును.

తి. వా. మొ. 3ప. 1తి. 1పా. "ముడిచ్చోతియూయ్". తా॥స్వామీ!నీయొక్క ముఖకాంతి కిరీటకాంతిగా వ్యాపించినదా? నీ పాదములయొక్క కాంతి ఆసనపద్మమై వ్యాపించినదా? సుందరమైన నీయొక్క కటికాంతి తేజోవంతమైన పీతాంబరముతోకూడా అనేక ఆభరణముల కాంతియై వ్యాపించినదా? స్వామీ!చెప్పుము.

## అర్చిరాది సారము-23

పరమపదనాథుడు ఆసీనుడైయున్న ఆ దివ్యసింహాసనమే అతడు ఉభయవిభూతుల నిర్వాహకుడని సూచించును.

తనకాంతిచేత ఇతరకాంతులన్నిటిని ముంచివేయుచున్న దీర్ఘమైన దివ్యకిరీటము స్వామి శిరస్సును అలంకరించియుండును. చూచువారి మనస్సును నేత్రములను చీకటి క్రమ్మునట్లుగా నల్లనై ఉంగరములు చుట్టుకొని అష్టమి చంద్రునినుండి అమృతధార పడుచున్నట్లు ఫాలభాగమందు ధరించిన దివ్యోర్ధ్వపుండ్రమును ఒకసారి కప్పివేయుచు, ఒకసారి కనపరచునటుల చలించుచు నల్లని, చల్లని పొడవైన కుంతలములను స్వామి కలిగియుండును.

శ్రియఃపతి యొక్క ఫాలభాగము సౌకుమార్యముచేత చిరుచెమట చెమర్చి ఆశపడిన వారిని బంధించతగిన స్థానమనునట్లుండును.

"కాణ్మిన్గళ్నైయర్"(తి. వా. మొ. 7ప. 7తి. 7పా. )తా॥తల్లులారా!చూడండి. శుక్లపక్షాష్టమితో చేరియున్న తెల్లని చంద్రుడో? ఆశపడినవారి విషపత్రమో? అనునటుల విశాలమైన నాలుగు భుజములుకల స్వామియొక్క ఫాలభాగమే బలము చేసుకొని నాప్రాణమును బాధించుచున్నది.

## అర్చిరాది సారము-24

వికసించి చల్లనైయున్న రెండు తామరపుష్పములను మదముచేత అణచి ఆడుచున్న రెండు భ్రమరపంక్తుల వలెను, శార్ఙ్గ మనెడు ధనస్సు వలెను సుందరమైన కనుబొమలను స్వామి కలిగియుండును.

"తరుమఱియాక్కుఱుంబనై"(నా. తి. మొ. 14తి. 6పా. )తా॥ధర్మము నెరుగని చాడీలు చెప్పువాడు, తనచేతియందలి శార్ఙ్గ మనెడిధనుస్సు వలె వంకరైన కనుబొమలు కలిగిన సుందరుడు, స్నేహము లేని శ్రీకృష్ణుని చూచినారా? నల్లని వాడై ఉదయాద్రిపై ఉదయించుచున్న సూర్యుని వలెనున్న కృష్ణుని బృందావనమున చూచితిని.

సంశ్లేషించి విశ్లేషించినవారికి రెండు మృత్యువులై, మిగిలినవారిని తల్లివలె రక్షించు రెండు ఎర్రని దివ్యనేత్రములు స్వామి కలిగియున్నాడు.

"ఏజైయరావియుణ్ఞు"(తి. వా. మొ. 7ప. 7కి. 1పా. )తా॥స్త్రీల ప్రాణములను భుజించెడి రెండు మృత్యువులేమో? ఎరుగను. సుందరుడైన ఉపకారకుడగు శ్రీకృష్ణుని నేత్రములేమో? ఎరుగను. సద్యోవికసితమైన తామరపుష్పముల వలె కనపడుచున్నవి. చూడండి.

"తూయాయ్"(తి. వా. మొ. 7ప. 1తి. 9పా. )తా॥పరిశుద్ధుడా!పూర్ణచంద్రునివలె ఆత్మలన్నింటిని తల్లియై రక్షించుచున్న చల్లని తామరపుష్పములవంటి నేత్రములు కలిగిన గొల్లవాడా!సముద్రముచే చుట్టుకొనబడిన లోకముల నేడింటిని భుజించిన నోరు కలవాడా!నిన్నెట్లు మరచెదను?

## అర్చిరాది సారము-25

శ్రియఃపతియొక్క దివ్యనేత్రములు చేతనులపట్ల వాత్సల్యము చేతను, లక్ష్మిదేవిని ఎల్లప్పుడు సమానముగా కటాక్షించుటచేతను, ఉభయవిభూతుల ఐశ్వర్యముచేతను ఎఱ్ఱగానుండును.

“పతిం విశ్వస్య”అనెడి ప్రమాణము అవసరము లేకయే సర్వేశ్వరత్వసూచకమై పరమాత్మ దివ్యనేత్రములుండును.

వేరొక సౌందర్యమందు వెళ్ళనీయక తనకే అనన్యార్హమయ్యేవిధముగాచేయునవి స్వామి దివ్యనేత్రములు. పుండరీకాక్షునే నిత్యసూరులు స్తోత్రముచేయుచుందురు. అతడే త్రిపాద్విభూతిని కూడా స్వాధీనముచేసుకున్న పరాత్పరుడు.

“ తామరై కణ్ణనై”(తి. వా. మొ. 2ప. 6తి. 3పా. )తా॥అరవిందలోచనుడు, తులసి మాలలు ధరించినవాడు, నిత్యసూరులచే స్తోత్రము చేయబడువాడు, మాకు ఉపకారకుడు, మా బంగారుకొండ అయిన శ్రియఃపతిని నాలుకతో స్తోత్రము చేసి, ధ్యానించి, నమస్కరించి, సంతోషించి ఆడెదము.

# అర్చిరాది సారము-26

చల్లనై శోభను పొంది నల్లనివై ప్రక్కలకు ఎఱ్ఱని రేఖలు వ్యాపించి పద్మముల వలె నుండి విశాలమై త్రుళ్ళిపడుచున్న మత్స్యద్వంద్వము వలె మనోహరమైన దివ్యనేత్రములు శ్రియఃపతికి మాత్రమే ఉన్నవి.

శ్రియఃపతియొక్క రెండు దివ్యనేత్రములు దూతకృత్యము చేయుచుండును.

“ఊతుమత్తీంగుజత్కేయుయ్యేన్”(తి. వా. మొ. 9ప. 9తి. 9పా. )

“ తా॥మధ్య మధ్య రసోక్తులను చెప్పి ఊదెడి మధురమైన వేణునాదమునకే నేను జీవించను. తనకు తానే చేసుకొనిన అలంకారముగల దౌత్యమును చేసెడి నేత్రములను పుచ్చుకొని ఒకటి చెప్పి మంచిమాటలతో కూడిన గానములు పుచ్చుకొని ఒకదానినిచూసి భేదమును పొందిన సుఖమును చేసి నొచ్చుకొని నొచ్చుకొని ముగ్ధమైన స్త్రీలయొక్క మనస్సునందలి ప్రణయరోషము పోవునట్లుగా పాడినపాటను ఒకదానిని కూడా ఎరుగను. సాయంకాలమైనది. ఆశ్చర్యభూతుడైన శ్రీకృష్ణుడిక రాడు.

## అర్చిరాది సారము-27

స్వామియొక్క దీర్ఘమైన సుందరమైన నాసిక  సమీపమందలి ఉన్నతమైన కల్పవృక్షము యొక్క లతయో చిగురో అనునట్లుండును.

"ఆట్టియుమ్ తూత్తియుమ్"(తి. వా. మొ. 7ప. 7తి. 2పా.  నందు)

సమీపమునందు వృద్ధిపొందుచున్న కల్పలతయో? చిగురో? ఎరుగను. వెన్నను తిన్నవాని నాసిక నామనస్సులోపల వెలిగించిన దీపకాంతివలె నిలచియున్నది.

ఆ సుందరమైన నాసికయొక్క చిగుళ్ళు ఉదయించినట్లు దివ్యకపోలస్థలములుండును.

ఆ దివ్యకపోలములయొక్క నూతనమైన పుష్పములో అనునట్లు పూర్ణచంద్రుడు వెన్నెలను ప్రసరింపచేసినట్లున్న దంతపంక్తియొక్క కాంతిని ప్రవహింపచేయుచున్నట్లు శ్రియఃపతి మందహాసముండును.

"పవళంబోల్"(తి. వా. మొ. 9ప. 2తి. 5పా. లో)తిరుప్పుళింగుడియందు పవళించినవాడా!పగడమువంటి అధరము ఎఱ్ఱపడునట్లుగా నీ దంతకాంతులనెడి ముత్యములయొక్క కిరణములు ప్రసరించుచున్న మందహాసము చేసి నేను సేవించునట్లు వచ్చి నీయొక్క పద్మనేత్రములు చూచునట్లు దయచేయుము.

నీ నోటినుండి వెలువడు మాటలను వినవలెననెడు కుతూహలమును అడ్డుకొని ఒడ్డునందే ఈదునట్లుచేసి , నట్టేట తెప్పనపహరించువారివలె మనస్సు నపహరించి మొరపెట్టునట్లు చేసినది  స్వామి తిరువధరము.

"కైయినార్ శురి"(అమలనాదిపిరాన్. 7పా. లో)శ్రీరంగక్షేత్రమున ఆదిశేషుని పర్యంకమున పవళించిన ఆశ్చర్యభూతుడైన స్వామి అధరము నన్ను నామనస్సును అపహరించినది.

## అర్చిరాది సారము-28

మకరకుండలముల వర్ణన

ప్రీత్యతిశయముచేతను శిరఃకంపవముచేతను కదలాడి దిగంతములను తాకి తేజస్సు అనెడి అలలతో లావణ్యసాగరమునెక్కి త్రుళ్ళిపడుచున్న అత్యుజ్వలమైన చలించుచున్న మకరకుండలములు కలవాడు.

"కణ్గళ్ శివన్దు"(తి. వా. మొ. 8ప. 8తి. 1పా)=నేత్రములు ఎఱ్ఱనై పెద్దవియై ఎఱ్ఱనైన అధరము తెల్లని దంతముల తేజస్సును ప్రకాశించుచున్నవై చలించుచున్న మకరకుండలములు కలవాడు.

"తున్నుమామణిముడిమేల్"(పె. తి. మొ. 8ప. 1తి. )=ప్రకాశించుచున్న గొప్పరత్నములను స్థాపించిన స్వామి మకరకుండలములు కాంతిని ప్రసరింపచేయుచున్నవి.

తిరుమఖమండల వర్ణన.

కాంతి శైత్యము మార్ధవము పరిమళము మొదలగు గుణములచేత సకలకళాపరిపూర్ణమై ఆహ్లాదజనకమై కళంకములేని చంద్రమండలమును, అప్పుడే వికసించిన ఎఱ్ఱతామరపుష్పములను ఓడించినదై సమీపించినవారిని మోహింపచేసెడి కాంతివంతమైన దివ్య తిరుముఖమండలము.

"శుత్తుమొళివట్టమ్"(పెరియ తి. మొ. 1ప. 5తి. 3పా. )=కాంతిమండలముచుట్టును చుట్టుకొని అంతటను తేజస్సుచేత వ్యాపించి ఎంతచేసినను నా కుమారుని తిరుముఖమండలమునకు సరిపోదు.

"పుయ్యుమాముకిల్"(నా. తి. మొ. 2తి. 4పా. =వర్షించుచున్న మేఘవర్ణుడా!నీ మాటలు వ్యాపారములు మమ్ములను పిచ్చెత్తించి మోహింపచేయుటకు నీముఖము మాయామంత్రమేమో?

"కోళిజై త్తామరైయుమ్"(తి. వా. మొ. 7ప. 7తి. 8పా. )=నేత్రములనెడి తామరలు, నాసిక అనెడి లత, అధరమనెడి పగడము, కనుబొమలనెడి ధనస్సు, మందహాసమనెడి ముత్యము, చెవులనెడి చిగురు, ముఖమనెడి చంద్రుడు అలంకరించుకొనతగిన పూర్ణమైన జ్యోతిర్మండలమో? మహొజ్వలమైన శ్రీకృష్ణుని ముఖము పాపముచేసిన నా ప్రాణమును అపహరించుచున్నది.

35. స్వామి యొక్క కంఠము వర్ణన.

శ్రీ భూ నీళాదేవేరుల హస్తాభరణములచేత ముద్రితమైన శంఖమువంటి కంఠము.

శ్లో ॥రమయతుసమాం......ఇవోల్లసన్. (శ్రీ. రం. రా. స్త. పూ. శ. 104శ్లో.

)తా ॥సుందరమైన బాలక్రముక కంఠశంఖముయొక్క అతిశయమును దొంగిలించుచున్నవియును, ఆలింగనము చేసుకొనుచున్న దేవేరుల హస్తములయందలి స్వర్ణకంకణములయొక్క సమ్మర్ధముచేత సంక్రమించిన రేఖలు కలిగి ప్రకాశించుచున్న శ్రీరంగనాథుని కంఠము నాకు ప్రీతిని కలిగించుకాక.

# అర్చిరాది సారము-29

36. సుందరమైన స్వామి భుజముల వర్ణన.

దేవేరులయొక్క కర్ణభూషణములచేత వికసించిన కేశపాశముచే కలిగిన విమర్ధముచేత అలంకరించబడినవై రెండుప్రక్కలయందు మరకతపర్వతము సానపట్టి ఉంచినట్లున్న దృఢమైనవి ఉభయవిభూతులను తననీడయందు పెట్టుకొని రక్షించతగినవియు, కోటలోపలనున్నవారువలె ఆశ్రితుల సంసారభయమును తొలగించునవియు , తనకు ఉభయవిభూతులు స్వాధీనమై దివ్యాస్త్రములచే పుష్పించినవో అనునట్లు కల్పవనమనతగిన అనేక భుజములు స్వామివారికి కలవు.

ప్రమాణములు.

1. (రా. యు. కాం. 21సర్గ. 5శ్లో ॥శయనే.... గంగాజలనిషేవితం)

2. (తి. వా. మొ. 6ప. 6తి. 6పా ॥కఱ్పకక్కావన. )

37. వక్షస్థల వర్ణన.

నిత్యానపాయినియైన పెరియపిరాట్టికి అంతఃపురమై పిచ్చొత్తించునదై ఆమె పాదపద్మములయందు ధరించిన లత్తుక చేత, శ్రీ భూ నీళా దేవేరులయొక్క స్తనములపై ధరించిన కుంకుమచేత అలంకరించబడినదై, వనమాలావిరాజితమై, పెరియపిరాట్టికి బంగారుప్రాకారమై , కౌస్తుభాది దివ్యాభరణములచేత ప్రకాశించుచున్న సుందరమైన వక్షస్థలము.

ప్రమాణ పాశురములు

1. అకలకిల్లేనిరైయుమెన్ఱు. (తి. వా. మొ. 6ప. 10తి. 10పా.

2. పెరుమావురవిల్. (పెరి. తి. మొ. 1ప. 3తి. 10పా. )

## అర్చిరాది సారము-30

38. నల్లని మేఘమందు మెరుపుతీగ వ్యాపించినట్లు దివ్యమంగళవిగ్రహమునకు అలంకారమును కలుగచేయుచున్నదై సౌందర్యమునకు అడ్డుకట్టినట్లున్న తెల్లని యజ్ఞోపవీతము.

39. హృదయమందుండి సంచరించుచున్నది అనుచున్నప్రకారముగా నిత్యముక్తులయొక్క హృదయములయందు సౌందర్యమును నింపు ఉదరబంధము.

40. సౌందర్యసాగరము సంకుచితస్థలమందు సుడి తిరిగినట్లు మనస్సును, నేత్రములను సుడిలో పడవేయుచున్న తిరునాభి.

41. శ్రీపాంచజన్యశంఖమును సుదర్శనచక్రమును చంద్రసూర్యులుగా తలచి వికసించుచు ముకుళించుకొనుచున్న బ్రహ్మ రుద్రులకు జన్మస్థానమైన నాభీపద్మము.

42. రాగరంజితమైన ఆకాశమువలెనున్న నడుముకు కాంతివంతమైన పట్టుపీతాంబరము.

43. అరటిస్తంభములవంటి ఊరువులు.

44. తామరకాడవలె గగుర్పాటుకల పిక్కలు.

## అర్చిరాది సారము-31

45. శంఖ చక్ర కల్పక ధ్వజారవిందాంకుశవజ్రరేఖల చేత చిహ్నితములై శ్రీ భూ నీళాదేవేరులు కూడా భయముతో స్పృశించవలసిన మిక్కిలి మృదువైన మకరందమునే ప్రవహించుచున్న మిక్కిలి భోగ్యములైన దుఃఖచ్ఛేదకములైన దివ్యపాదారవిందములు.

46. లావణ్యసాగరముయొక్క తరంగపంక్తి వలెనున్న వ్రేళ్ళు.

47. ఆ వ్రేళ్ళయందు అనేక చంద్రులుదయించినట్లు దివ్యనఖములు.

48. వజ్రమును కరిగించునది, పురుషులనుకూడ సమ్మోహపరచునది , సంసారసంబంధమును తొలగించి పరమానందమును కలిగించునది, చూచినంతనే సమస్త తృష్ణను నశింపచేసి కృష్ణతృష్ణను పెంపొందించునది శ్రియఃపతి యొక్క దివ్యమంగళ విగ్రహ సౌందర్యము.

49. సంసారసంబంధమే ఎరుగని నిత్యసూరుల మనస్సును నేత్రములను అపహరించునది పరమపదనాథుని దివ్యమంగళవిగ్రహసౌందర్యము.

50. సమస్తజనులకు జీవనౌషధమై, చాతుర్యవిద్యకు గృహమై, మనోరథములన్నింటిని నెరవేర్చునదై, వేదాంతవాక్యముల సర్వస్వమై, మాణిక్యభరిణెయందు బంగారము పెట్టిఉంచినట్లు, హిరణ్యవర్ణమైన దివ్యత్మస్వరూపమునకు ప్రకాశకమైనది దివ్యమంగళవిగ్రహము.

51. ఒకదానినొకటి త్రోసుకొని సంకుచితస్థలమందు ప్రవాహమువలె సుడి తిరిగి సంచరించుచున్న ఆయుధాభరణముల యొక్క తేజఃప్రవాహమందు ఊహించవలసిన నల్లని సుందరమైన దివ్యమంగళవిగ్రహసౌందర్యము.

52. ఇక స్వామివారి దివ్యమంగళవిగ్రహ సౌకుమార్యము నిత్యసూరుల చూపును కూడ సహింపచాలదు.

53. పెరియపిరాట్టియొక్క సుందరమైన కాంతివంతమైన దివ్యనేత్రములకు నిత్యలక్ష్యమగుటచేత మొగ్గయని, పుష్పమని, చెప్పతగినది స్వామి వారి దివ్యమంగళవిగ్రహశోభ.

## అర్చిరాది సారము-32

54)స్వామి వారి తిరుమేనియందున్న అనేక దివ్యాభరణములు సౌందర్యప్రవాహమునకు అడ్డుపెట్టినట్లుండును.

55)శ్రియఃపతియొక్క దివ్యమంగళవిగ్రహకాంతి ఎఱ్ఱని బంగారమువలె ప్రకాశించుచుండును. నిత్యసూరులను అనుభవింపచేసుకొనుచు వడకట్టినవారి ముఖమందు నీటిప్రవాహమును విడిచినట్లు , సకలశ్రమలు శాంతించునట్లు చల్లనై స్వచ్ఛమై బంగారు పర్వతమును కరగించి సముద్రమున కలిపినట్లు నల్లనైన దివ్యమంగళవిగ్రహకాంతిచేత సమస్తజగత్తులు సంతృప్తిని పొందును.

56)వీధులయందు అంతటా నల్లకలువలు ప్రవహించుచున్నవో అనునట్లు స్వామి తిరుమేని యందలి దివ్యపరిమళము శ్రీవైకుంఠమంతటా సమానముగా పరిమళించును.

57)శ్రియఃపతియొక్క నిర్హేతుక కృపాకటాక్షవర్షము  శరీరమంతటా వణకును పుట్టించునట్లు చల్లనై అరక్షణమును పోగొట్టి నిత్యముక్తులను రక్షించి, తడిచాలక చచ్చిపోయెడి చేనువలెనున్న చేతనులనెడి పంటచేలను తడిపి చిగుళ్ళు ఆకులును కలగునట్లు చేయును.

58)గాంభీర్య మాధుర్యాది నిరవధిక గుణగణములచేత అలంకరింపబడినదై అతిమనోహరమైన దివ్యభావగర్భిత పుష్పము వికసించినట్లు శ్రియఃపతియొక్క తిరుముఖమండలము అంతటా సమానముగా ప్రకాశించును.

59)శ్రియఃపతి తన లీలాలాపముచేత నిత్యముక్తులయొక్క హృదయములను ఆహ్లాదపరచుచు  ఉభయవిభూతులను ఆసనబలము చేతనే జయించును.

## అర్చిరాది సారము-33

1)సమస్తలోకములును అద్వితీయమైన ఆజ్ఞాప్రకారము జరుగునట్లుగా, నిత్యసూరుల సమూహములు నమస్కరించుచుండగా, వేంచేసియున్న శ్రీవైకుంఠనాథుని తన మనోరథమందుంచుకొని ముక్తపురుషుడు కనుల కరువు తీరినట్లు దర్శించును.

శ్లో. దృష్ట ఏవహి నశ్శోక మపనేష్యతి రాఘవః

తమ స్సర్వస్య లోకస్య సముద్యన్నివ భాస్కరః.

తా॥సమస్తలోకములయొక్క చీకటిని ఉదయించుచున్న సూర్యునివలె రాముడు చూడబడినవాడై మనయొక్క శోకమును పోగొట్టుచున్నాడు కదా!

2)"సమస్తపరివారాయ శ్రీమతే నారాయణాయ నమః"అని సంతోషపరవశుడై లేచి కూర్చుని అత్యంతప్రీతితో వెళ్ళి పాదపీఠమున అడుగుపెట్టి ముక్తపురుషుడు పరమపదనాథుని దివ్యసింహాసనమును అధిరోహించును.

3)అవాక్యనాదరః(మాటలాడనివాడు, ఆదరము లేనివాడు)అని చెప్పబడు ఆ సర్వజగన్నాథుడు ఆపద్ధతి విడచిపెట్టి చంద్రుని చూచిన సముద్రమువలె వికారమును పొంది తనను ఎడబాసి చాలాదినములు సంసారమనెడు ఘోరనరకమందు పడియున్న నష్టము తీరునట్లుగా శ్రీరాముడు భరతుని తన అంకపీఠమున కూర్చొనపెట్టుకొనిన విధముగా ముక్తుని శ్రీవైకుంఠనాథుడు తన ఒడిలో కూర్చుండపెట్టుకొనును.

మం. సర్వకర్మా సర్వకామస్సర్వగంధః సర్వరసః
సర్వమిదమభ్యాత్తో౽నాదరః. (ఛాం. ఉ. ప్ర. 14, 14ఖం. 2మం. )

తా॥సమస్తము కర్మగా కలవాడు, సమస్తకామములు కలవాడు , సర్వరసములుకలవాడు, సమస్త గుణజాతమును స్వీకరించినవాడు, ఎవరితోని మాటలాడనివాడు, ఎవరిని ఆదరింపవలసిన అవసరములేనివాడు.

శ్లో. తంసముత్థాప్య కాకుత్స్థశ్చిర స్యాక్షిపథం గతమ్
అంకే భరతమారోప్య ముదితః పరిషస్వజే॥(రా. యు. కాం. 130స. 41శ్లో. )

తా॥శ్రీరాముడు చాలాకాలమునకు దృక్పథమును పొందిన భరతుని లేవనెత్తి తన తొడమీద కూర్చుండపెట్టుకొని సంతోషించి గాఢాలింగనము చేసుకొనెను.

## అర్చిరాది సారము-34

4)భరతుని శ్రీరాముడు, అక్రూరుని శ్రీకృష్ణుడు కౌగలించుకున్నట్లు, పరవాసుదేవుడు ముక్తుని కౌగలించుకొని పరమప్రీతితో"నీవు ఎవరు? "అని ప్రశ్నించును.

5)"అహం బ్రహ్మాస్మి"(నేను బ్రహ్మకు శరీరభూతుడను)నేను రాజకుమారుడను అనగా, "నీవింతకాలము ఏమి చేసితివి? "అని ప్రశ్నించును.

6)చందనము ధరించిన మృదువైన స్తనములుకల స్త్రీలయొక్క గాఢాలింగనముచే కలిగిన ఆనందప్రవాహమున మునిగితిని అని సమాధానము చెప్పును. "నీవు దానిచే పొందిన ఫలమేమి? "అని స్వామి ప్రశ్నించును.

7)క్రూరమైన నరకలోకమునందు మునిగెడి ఫలితమును పొందుతిని అని చెప్పును.

8)నరకలోకానుభవము పొందిన తరువాత నీవు ఏమి చేసితివి? అని ప్రశ్నించగా, స్వామీ!మీవద్దకు వచ్చితిని అనును. నీవు వచ్చిన ఉపాయమేమి? అని ప్రశ్నించును. "పుణ్యస్వరూపుడవైన నీవే ఉపాయమని సమాధానము చెప్పును. మమ్ములను చేరినందున నీవుపొందిన ప్రయోజనమేమి? అని స్వామి ప్రశ్నించును. నాయొక్క క్రూరమైన సమస్తపాపములను పోగొట్టుకొంటిని అనును.

9)చేసినది ఫలించి ఐశ్వర్యమును పొంది ఆనందమునకు అంతములేని అద్వితీయమైన పరమపదమను శ్రీవైకుంఠమును లభించక క్రూరమైన సంసారమందు తల్లడిల్లినావే? ఫలమునకు ముందే కళ్యాణగుణములయందు అవగాహించక, క్రూరమైన జనన మరణ చక్రమందు పడి బాధపడినావే? అని పరమపురుషుడు ముక్తపురుషుని ఓదార్చును.

## అర్చిరాది సారము-35

10)అంతములేని భగవదనుభవానంద ప్రవాహమును కోల్పోయి ఘోరమైన సంసారదుఃఖమును పొందినావే.

11)మమ్మలను పట్టి చూడవలెనని ఆశపడిననాడే వచ్చి ముఖమును చూపకపోతిమే.

12)మేమున్న శ్రీవైకుంఠమును తలచి ఏడ్చుచు నమస్కరించి నన్ను పిలుచుకునే కాలమింకను సమీపించలేదా? ఏనాడు నేను నిన్ను కూడుదును? అని బాధపడినను మేము ఆలస్యము చేసినామే?

13)సంసారదుఃఖసాగరమందు మునిగి విష్ణువనెడి నావ లభించక బాధపడిననీవు దానినుండి ఒడ్డెక్కి నా పాదసన్నిధిని పొందినావే.

14)ఆత్మతాపము శాంతించినట్లుగా మమ్ములను పొందినావు. మాయొక్క సృష్ట్యాదివ్యాపారములు ఈనాటికి సఫలమైనవి.

15)పోయిన నావస్తువు లభించినదే!నీ ఆగమనము వలన ఈవైకుంఠము సనాథమైనది.

16)ఈగోష్టికి నాయకరత్నమువలె నీవు వచ్చి ఔజ్జ్వల్యమును కలుగచేసినావు.

17)నడచివచ్చిన పాదములు నొచ్చుకున్నవా? అని పరమాత్మ మనోహరమైన చాటువాక్యములచే ముక్తుని ఆహ్లాదపరచును. వందిమాగధులవలె స్తోత్రము చేసి నెమలివలె సంభ్రమించును.

## అర్చిరాది సారము-36

18. అనేక భీకరవ్యాధులచే పీడింపబడి నీలరత్నమువంటి వర్ణము కలిగిన ఘనవైద్యుని సమీపించి, సమస్తవ్యాధులను దూరముచేసుకొని , ఆరోగ్యస్నానము చేసిన పుత్రుని తండ్రిచూచినట్లు ముక్తుని పరమాత్మ చూచును.

19. ఆళ్వారులను, విభీషణుని తననేత్రములచే పానముచేసినట్లు చూచిన అరవిందలోచనుడగు పరమాత్మ ముక్తుని అంత ప్రీతితో చూచును.

20. చాలాకాలమునుండియున్న తృష్ణయంతయు శాంతించునట్లుగా తామరలు కల తటాకములోని వికసించిన పుండరీకములవంటి పెద్దనేత్రములయందు ఒకతూము తెరచినట్లు కటాక్షమును ప్రసరింపచేసి ముక్తుని ఆదరించును.

21. "తాయేతన్తై"అనెడి తిరువాయిమొళియందు తిరుమంగైఆళ్వారు కోరినట్లు, "ఆరావముతే"అను తిరువాయ్ మొళియందు నమ్మాళ్వారులు కోరుకున్నట్లు ముక్తుని కోరికలనన్నింటిని సర్వఫలప్రదుడైన సర్వేశ్వరుడు సఫలముచేయును.

22. రూపము కనిపించకుండా దాచిన కోటిసూర్యతేజస్సు కలిగిన పరమాత్మ తన దివ్యస్వరూపమును ముక్తునిచేత దర్శింపచేయును.

23. ఉపకరించి నన్ను ఇక విడువడు అనుచున్న ప్రకారముగా పరమాత్మ సర్వస్వమైన తన గాఢాలింగనమును ముక్తునకు అనుగ్రహించును.

24. ఇది చిత్తమోహమా? ఇది చిత్త విభ్రమమా? అనునట్లు శ్రియఃపతి ఆశ్రితవ్యామోహముతో ముక్తశిశువును పెరియపిరాట్టి చేతికందించును.

25. కంసవధానంతరము శ్రీకృష్ణుని చూచిన దేవకిదేవి వలె లక్ష్మీదేవి సంతోషముతో ఉప్పొంగి ప్రవహించుచున్న స్తన్యముచేత ముక్తశిశువు శరీరమంతయు తడసిపోవునట్లు కౌగలించుకొనును.

## అర్చిరాది సారము-37

26. ఉభయవిభూత్యైశ్వర్యమును అనుగ్రహించగా మహాలక్ష్మి అమ్మవారి ఒడినుండి దిగి జగన్మోహనాకారుడైన స్వామి ముందుకువచ్చి ముందున్న సౌందర్యమును ముక్తుడు అనుభవించును.

27. మన్మథమన్మథుడైన పరమపురుషుని దివ్యసౌందర్యప్రవాహమునకు ఎదురుగానిలచి అనుభవించుటకు శక్యము కాకపోవుటచేత ముక్తుడు ప్రక్కకువచ్చి అచ్చటి సౌందర్యమును అనుభవించును.

28. ప్రక్క సౌందర్యమును అనుభవించి విడిచినచో భరించలేకపోవుటచేత, వెనుకకు వచ్చి అక్కడయున్న సౌందర్యమును ముక్తుడు అనుభవించును.

29. వెనుకనున్న సౌందర్యముకంటె ముందున్న సౌందర్యమేగొప్పగానున్నదని తిరిగి ముక్తుడు ముందునకు వచ్చి సౌందర్యతరంగములు కొట్టుటచేత చంచల చిత్తవృత్తి కలవాడగును.

30. ముక్తుడు అంజలిబద్ధుడై భ్రమరములు ముసురుకొని ఆడుచున్న తులసి పుష్పమాలికలను  తిరుమేనియందు చందనమును అలదుకొనిన అలంకారమును ఏమని చెప్పకలను?  అనును. చిత్రలేఖనమందు నేర్పరులు లిఖించిన తామరపూవులనతగిన నేత్రములు, విశాల వక్షస్థలము, బాహువులు, అధరము ఇలా ప్రతి అవయవము అత్యంతసుందరముగానున్నవి. వీరెవరో? అద్వితీయులైన వీరి సౌందర్యము నాకు ఆశ్చర్యము కలిగించినదని ముక్తుడు పరమానందభరితుడగును.

## అర్చిరాది సారము-38

31.  అన్వామత్తన్ను, ముడిచ్చోతి మొదలగువానియందు నమ్మాళ్వారులు అనుభవించినట్లు తనను లభించిన ప్రీతిచే వచ్చిన శోభను ముక్తుడు అనుభవించును.

32.  దేనిని చూచిన ఇతరమైనదానిని దేనిని గాని చూడడో అనుచున్నప్రకారముగా వేరొకదానియందు మనస్సు వెళ్ళకుండా ముక్తుడు “హావు, హావు, హావు, అహమన్నమహమన్న మహమన్నం”అని సామగానము చేయును. కమలాలయయైన లక్ష్మీదేవితోకూడా దాసుడనైన నేను సేవించి

దుఃఖమును పోగొట్టుకొంటిని. స్వామీ!సుందరమైన కంకణములుగల లక్ష్మీదేవియును నీవు మాత్రమే ఉండగా సేవించుకొనే మహద్భాగ్యమును అనుగ్రహించితివి. స్వామీ!మీ పాదపద్మములను ఆశ్రయించితిని. నన్ను ఒప్పించి నీదివ్యపాదారవిందములక్రింద చేరి ఉండునట్లు మహోపకారము చేసినావు. జనన మరణ చక్రమున చిక్కుకొని కొట్టుమిట్టాడుచున్న నా కష్టమును తొలగించి నా అజ్ఞానమును ధ్వంసము చేసితివని ముక్తుడు శ్రియఃపతిని నోరారా ప్రీతితో ప్రస్తుతించును.

33. శ్రీవైకుంఠనాథుడు తన చల్లనిచూపులతో ముక్తుని కటాక్షించి మందహాసముతో స్నేహయుక్తమైన మధుర గంభీరవాక్యములచే ఎదుటకు పిలుచును. ఇతడు అపేక్షించినవిధముగా కమలవాసినియైన లక్ష్మీదేవి పట్టుకొను దివ్యాభరణధ్వనికల పాదారవిందములను ముక్తుని శిరస్సున అలంకరించును.

34. శ్రియఃపతి ముక్తుని తన పాదద్వంద్వము క్రింద చేర్చుకొని నిత్యకైంకర్యమందు నియోగించును.

35. అవిచ్ఛిన్న కైంకర్యము చేయవలెననెడి అభినివేశముచేత ముక్తుడు అందుకు అనుగుణముగా అనేక దేహములను పరిగ్రహించును.

36. సమస్తకైంకర్యములయందు అన్వయించి అవసరము లేకపోయినను భగవద్రక్షణ వ్యసనము కలిగిన నిత్యసూరివర్యులతో ముక్తుడు చేరి భగవంతునకు మంగళాశాసనము చేయును.

37. ముక్తుడు అమృతసాగరాంతర్నిమగ్నుడై యావత్కాలము బ్రహ్మానందమును అనుభవించును.

## అర్చిరాది సారము సంపూర్ణము

## శ్రీ పిళ్ళై లోకాచార్యర్ దివ్యతిరువడిగళే శరణం

అర్చిరాది సారమును ఆస్వాదించి స్పందించిన
భాగవతోత్తములందరికి
కృతజ్ఞతాపూర్వక దాసోహములు.